సాక్షి సూర్యాపేట

శనివారం । 2 । మార్చి । 2024



‘ఆడిట్’లో అగ్నిప్రమాదం

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆడిట్ కార్యాలయంలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది.

- 8లో



ఆర్య సమాజ్‌లో యజ్ఞం

నల్లగొండ ఆర్య సమాజ్ మందిరం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాయజ్ఞం నిర్వహించారు.

- 8లో



యాదాద్రి అభివృద్ధికి కృషి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి

సాక్షి ఎఫెక్ట్..

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని అన్నిశాఖల కార్యాలయాల్లో సమాచార హక్కు బోర్డులను 72 గంటల్లో ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. కనిపించని సమాచార బోర్డులు అనే శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురించిన కథనానికి కలెక్టర్ స్పందించి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్, జిల్లా కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం–2005 శాశ్వత బోర్డులను మూడు రోజుల్లో ఏర్పాటు చేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

సేవాకేంద్రాలు ప్రారంభించాలి



వెబెక్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలోని అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం నుంచి ప్రజాపాలన సేవా కేంద్రాలను ప్రారంభించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి శుక్రవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజాపాలన సేవా కేంద్రాల గురించి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా అధికారులతో న్విహించిన వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో ఈ– పంచాయతీ ఆపరేటర్లను వినియోగించి డేటా ఎంట్రీ చేపట్టాలని సూచించారు. ప్రజాపాలన సేవా కేంద్రాలు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తామన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీలో ఐదు, తిరుమలగిరి, హుజూర్‌నగర్ మున్సిపాలిటీల్లో రెండు, కోదాడలో మూడు, నేరేడుచర్లలో ఒకటి చొప్పున సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అప్పారావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, స్పెషల్ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

దురాజ్‌పల్లి (సూర్యాపేట): గ్రూప్స్, బ్యాంకింగ్ సర్వీసెస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయనున్న ఉద్యోగాల పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఇవ్వనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి లత, స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు www.trrtudycirce.co.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష మార్చి 10న ఉదయం 11గంటలకు ఉంటుందని పేర్కొన్నారు.

రైతులకు ఎరువుల కొరత రానివ్వం

చిలుకూరు: రైతులకు ఎరువుల కొరత రానివ్వబోమని జిల్లా సహకారి అధికారి పద్మ అన్నారు. శుక్రవారం ఆమె చిలుకూరు, బేతవోలు పీఏసీఎస్‌లలో ఎరువుల గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం చిలుకూరులో డీసీఓను సన్మానించారు. ఆమె వెంట క్లస్టర్ అధికారి అంజయ్య, జిల్లా ఆడిటర్ అంబేడ్కర్, సంఘం చైర్మన్లు అలసకాని జనార్దన్, బాషం సైదులు, సీఈఓలు చిలువేరు ఆంజనేయులు, సయ్యద్ పాషా, డైరెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాలి



జిల్లా కబడ్డీ జట్టుతో అసోసియేషన్ నాయకులు

హుజూర్‌నగర్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు క్రీడాకారులు రాణించాలని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామచంద్రగౌడ్, నామా నరసింహారావు అన్నారు. హుజూర్‌నగర్‌లోని టౌన్ హాల్‌లో జరుగుతున్న సీనియర్ కబడ్డీ జట్టు శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా వారు జిల్లా జట్టును ప్రకటించి మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో శనివారం ఈనెల 4వ తేదీ వరకు జరిగే రాష్ట్ర 70వ సీనియర్ కబడ్డీ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. జట్టుకు కోచ్‌గా కదిర వెంకట్‌రెడ్డి, మేనేజర్‌గా జాతీయ క్రీడాకారుడు రవీందర్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో శివనాగిరెడ్డి, షేక్ ఇమామ్, ఎస్.వెంకటేశ్వరరావు, సునీల్‌కుమార్, మస్తాన్, అలీ, ముస్తఫా పాల్గొన్నారు.

తాగి నడిపితే జైలుకే..

- మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసు నిఘా
- జిల్లాలో నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- పలుమార్లు పట్టుబడిన వారికి జైలుశిక్ష, జరిమానా
- తాగి వాహనాలు నడపొద్దని అవగాహన కల్పిస్తున్న పోలీసులు



డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా వాహనదారుడిని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు

సూర్యాపేట మండలం ఇమాంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడిపి పలుమార్లు పట్టుబడ్డాడు. సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి మూడు రోజుల జైలు, రూ.2 వేలు జరిమానా విధించారు.

కోదాడ మండలం కందిబండ గ్రామానికి చెందిన మరో వ్యక్తి మద్యం తాగి వాహనం నడిపి పలుమార్లు పట్టుబడ్డాడు. కోదాడ ట్రాఫిక్ పోలీసులు అతడిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి అతనికి ఐదు రోజులు జైలు, రూ.4 వేలు జరిమానా విధించారు. ఇలా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పలుమార్లు పట్టుబడితే జైలుపాలు కాకతప్పదని పోలీసులు చెబుతున్నారు.

సూర్యాపేట క్రైం: మద్యం తాగి వాహనం నడిపితే నడిపిన వ్యక్తితో పాటు ఎదుటివారి ప్రాణాలకు కూడా అపాయమే. నిత్యం జరుగుతున్న ప్రమాదాల్లో 70శాతం వరకు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల చోటుచేసుకున్నవే ఉంటున్నాయి. మద్యం తాగి వామనం నడుపుతూ ఒక్కరు చేసిన తప్పుకు చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ క్రమంలో డ్రంకెన్ డ్రైవ్ విషయంలో సూర్యాపేట జిల్లా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సీరియస్‌గా ఉన్నారు. జిల్లాలో నిత్యం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ.. రెండుకన్నా ఎక్కువసార్లు మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడితే కటకటాల వెనక్కి పంపిస్తున్నారు. దీంతోపాటు తాగి నడపొద్దని ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్

మద్యం సేవించి పట్టుబడిన వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిగే అనర్థాలను గురించి ఉదాహరణలతో వివరిస్తున్నారు. మద్యం తాగితే అనారోగ్యంతో పాటు తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురై ఇప్పటికే చాలా కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఎందరో తల్లిదండ్రులు చేతికందిన కొడుకులను కోల్పోయిన ఘటనలను ఉన్నాయని అవగాహన సదస్సుల ద్వారా మార్పు వచ్చేలా కృషి సల్పుతున్నారు. అయినప్పటికీ తాగి వాహనాలు నడపడం ఆపకపోగా.. పలుమార్లు పోలీసులకు పట్టుబడుతున్న వారి సంఖ్య ప్రతినెలా పెరుగుతోంది. రెండుకన్నా ఎక్కువసార్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిని జైలు శిక్ష, జరిమానాలు విధిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో చాలా ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీ సుల ఆధ్వర్యంలో నిత్యం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. పట్టణ శివారులు, ప్రధాన చౌరస్తాలు, అనుమానం ఉన్న గ్రామాల పరిసర ప్రాంతాల్లో నిత్యం పగలు, రాత్రనే తేడాలు లేకుండా పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్నారు. రెండుసార్లు కన్నా ఎక్కువసార్లు పట్టుబడిన వారి డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేయడానికి ట్రాఫిక్ పోలీసులు సిఫారసు చేస్తున్నారు. ఆర్టీఏ అధికారులు వారి లైసెన్స్‌లు రద్దు చేస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



“మద్యం సేవించి వాహనాలు నడిపి ఎందరో ప్రమాదాలకు గురై ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు అనేకం. మద్యం మత్తులో వేగం తెలియక వారి ప్రాణాలతో పాటు ఎదుటి వారిని బలిచేస్తున్నారు. జిల్లాలో నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్నాం. పలుమార్లు మద్యం సేవించి పట్టుబడిన వారిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తున్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దు.

– బీకే రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

డ్రంకెన్ డ్రైవ్ కేసులు

నెల	2023	2024
జనవరి	212	192
ఫిబ్రవరి	79	318
మార్చి	243	-
ఏప్రిల్	312	-
మే	192	-
జూన్	317	-
జూలై	111	-
ఆగస్టు	243	-
సెప్టెంబర్	190	-
అక్టోబర్	221	-
నవంబర్	311	-
డిసెంబర్	171	-

తాగునీటి ఎద్దడిని నివారించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పద్మావతి

- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- హైదరాబాద్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్ష

హుజూర్‌నగర్: ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి హుజూర్‌నగర్, నేరేడుచర్ల, కోదాడ మున్సిపాలిటీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, వేసవిలో మంచి నీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మున్సిపల్, విద్యుత్, పబ్లిక్‌హెల్త్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు సమృద్ధిగా ఉన్న బావులు, బోర్లతోపాటు ట్యాంకర్లను లీజుకు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హుజూర్‌నగర్ మోడల్ కాలనీలో ఉన్న డంపింగ్ యార్డును వేరేచోటుకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కాలనీకి 3ఫేజ్ విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలన్నారు.

రింగ్‌రోడ్డు పనులు నాణ్యతతో చేపట్టాలి

హుజూర్‌నగర్‌లో రింగ్ రోడ్డు, మెయిన్ రోడ్డు పైప్‌లైన్, రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మంత్రి పేర్కొన్నారు. టౌన్ హాల్, గ్రంథాలయ భవనం పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కోదాడ మున్సిపాలిటీలో యూఐడీఎఫ్ (అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ ఫండ్స్) నిధులు రూ.230 కోట్లతో అండర్ డ్రైయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు ఆయన చెప్పారు. కోదాడ మున్సిపాలిటీ పరిధిలో మిగిలిన ప్రధాన రోడ్లను విస్తరించాలని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని, కోదాడ, నేరేడుచర్ల మున్సిపాలిటీ భవనాలు శిథిలావస్థకు చేరాయని, వాటి స్థానంలో నూతన భవనాలు మంజూరు చేయాలన్నారు. ఆయా మున్సిపల్ పాలకవర్గాలు విద్యుత్ సమస్యలను మంత్రి దృష్టికి తేవడంతో పరిష్కరిస్తామనని హామీ ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిత్యకైంకర్యాలు, ఎదుర్కోలు మహోత్సం చేపట్టారు. అనంతరం మాంగళ్యధారణ గావించారు. ఆ తర్వాత శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాఢ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

16న జాతీయ మెగా లోక్‌అదాలత్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

చివ్వెంల(సూర్యాపేట): జిల్లా వ్యాప్తంగా ఈనెల 16న జరుగనున్న జాతీయ మెగాలోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ఆర్టీసీ, బ్యాంకు, ఇన్సూరెన్స్, న్యాయవాదులకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న జరగాల్సిన లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సెలవుల దృష్ట్యా హైకోర్టు 16వ తేదీకి మార్చిందన్నారు. దీనివల్ల మనకు సమయం పెరిగిందని, ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా చూడాలని కోరారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి, క్రిమినల్, సివిల్, బ్యాంకు, విద్యుత్, ఎక్సైజ్, గృహహింస, వెహికిల్ చట్టం కింద నమోదైన కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఇరువురి రాజీ పడటం వల్ల ఇద్దరు గెలిచిన వారు అవుతారని, సమయం, ధనం వృథాకాకుండా ఉంటుందని సూచించారు. సంవత్సరాల తరబడి కోర్టు చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోండ్రాల అశోక్, న్యాయవాదులు వసంత సత్యనారాయణపిళ్లే యాదవ్, జే.శశిధర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ రైతులను ఆదుకోవాలి



సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆత్మకూర్(ఎస్), పెన్‌పహాడ్, చివ్వెంల మండలాల రైతులు

- కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందక పంటపొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన బాట పట్టారు. సూర్యాపేట నియోజకవర్గం పరిధిలోని ఆత్మకూర్ (ఎస్), పెన్‌పహాడ్, చివ్వెంల మండలాల పరిధిలోని ఆయకట్టు రైతులు శుక్రవారం సూర్యాపేటలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎస్సారెస్పీ పరిధిలోని 69, 70, 71 డీబీఎం కాలవ్లల్లో సామర్థ్యానికి సరిపడా నీరు రాకపోవడంతో చివరి ఆయకట్టులో పొలాలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం స్పందించి సాగునీరు అందించి ఆదుకోవాలని కోరారు. భారీగా పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశామని, చేతికొచ్చే సయమంలో ఎండిపోతున్నాయని వాపోయారు. మరో 15రోజుల పాటు సాగునీరందిస్తే పంటలు చేతికందుతాయన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

రైతుల వద్ద పురుగుల మందు డబ్బా

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన రైతుల్లో ఒకరైన నూతనకల్ మండల కేంద్రానికి చెందిన మల్లారెడ్డి పురుగుల మందు డబ్బాతో వచ్చారు. నిరసన సమయంలో డబ్బాలో మందును తాగేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు ఈ విషయాన్ని గమనించి పురుగుల మందు డబ్బాను తీసుకున్నారు.

కోటపహాడ్‌లో రైతుల రాస్తారోకో

ఆత్మకూర్(ఎస్): ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సరిపడా నీళ్లు విడుదల చేయకపోవడంతో వరి పొలాలు ఎండిపోతున్నాయని, వెంటనే నీటిని విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మండలంలోని కోటపహాడ్ గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం స్థానిక రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ ఎస్సారెస్పీ నీటిని విడతల వారీగా వదలడంతో చివరి భూములకు చేరడంలేదన్నారు. చెరువులు, కుంటల్లో నీళ్లులేక బోర్లు కూడా అడుగంటాయన్నారు. వారబందీని ఎత్తివేసి 22–ఎల్ ద్వారా వెంటనే నీరు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొచ్చర్ల ముత్యాలు, జూకుంట్ల వీరయ్య, కాకి మోహన్‌రెడ్డి, వాసు వెంకన్న, రైతులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం

- బీజేపీ విజయ సంకల్ప యాత్ర ఇన్‌చార్జి నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి

సూర్యాపేట: భారత దేశానికి నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమని బీజేపీ విజయ సంకల్ప యాత్ర ఇన్‌చార్జి నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రం చేరుకున్న యాత్రలో వారు మాట్లాడారు. నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో పేదవర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. కరోనా కాలంలో 140కోట్ల మంది ప్రజలకు వ్యాక్సిన్లు, 80కోట్ల మంది పేదలకు 5కిలోల చొప్పున రేషన్ బియ్యం ఉచితంగా అందించారన్నారు. ఆర్టికల్ 370 రద్దుతో దేశంలో తీవ్రవాదాన్ని అణచివేశారని వెల్లడించారు. రామ మందిరం నిర్మాణంతో హిందువుల కల సాకారం చేశారని చెప్పారు. నల్లగొండలో బీజేపీ అభ్యర్థిని ఎంపీగా గెలిపిస్తే హైదరాబాద్–విజయవాడ రైల్వే మార్గం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి, నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, మన్మాద రెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణ, కర్నాటి కిషన్, సంకినేని వరుణ్ రావు, సలిగంటి వీరేంద్ర, ఎమ్మార్పీఎస్ నేతలు పాల్గొన్నారు.

గల్లీలో సేఫ్‌గా ఉండాలంటే ఢిల్లీలో మోదీ ఉండాలి

కోదాడ: గల్లీలో దేశ ప్రజలు సురక్షితంగా ఉండాలంటే ఢిల్లీలో మోదీ ప్రధానిగా ఉండాలని బీజేపీ విజయ సంకల్ప యాత్ర ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడలో కొనసాగిన యాత్రలో భాగంగా రంగా థియేటర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 17 సీట్లను బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మోసపు మాటలతో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెడుతుందని విమర్శించారు. గడిచిన పది సంవత్సరాలలో దేశంలో అవినీతి రహిత పాలన అందించిన ఘనత నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడానికే విజయ సంకల్ప యాత్రను చేపట్టినట్లు ఆయన తెలిపారు. అంతకు ముందు కోదాడ పట్టణంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వీరికి ఎమ్మార్పీస్ నాయకులు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గార్లపాటి జితేంద్రకుమార్, కనగాల నారాయణ, కనగాల వెంకట్రామయ్య, మన్మథరెడ్డి, బొలిశెట్టి కృష్ణయ్య, నూనె సులోచన బండారు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట : విజయ సంకల్ప యాత్రలో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి



కోదాడలో నిర్వహించిన మోటార్ సైకిళ్ల ర్యాలీలో పాల్గొన్న బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

లక్ష్యం చేరని సీఎంఆర్

- గడువు ముగిసినా ప్రభుత్వానికి అందని బకాయిలు
- కాలయాపన చేస్తున్న కోదాడలోని కొందరు మిల్లర్లు
- భారీగా పేరుకుపోయిన సీఎంఆర్ బకాయిలు
- వానాకాలం 11.. యాసంగి సీజన్‌లో 86 శాతం పెండింగ్



కోదాడలో బియ్యం మిల్లులను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ (ఫైల్)

కోదాడ: సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అప్పగింతకు మిల్లర్లకు ఇచ్చిన గడువు గురువారంతో ముగిసినా లక్ష్యం పూర్తికాలేదు. దీంతో ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సీఎంఆర్ బకాయిలు ఇంకా పేరుకుపోయే ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రెండుసార్లు గడువు పెంచినప్పటికీ మిల్లర్లు మాత్రం సీఎంఆర్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. కోదాడ డివిజన్‌లో ఉన్న 31 మిల్లుల్లో కొందరు మిల్లర్లు ప్రభుత్వానికి పూర్తిగా సీఎంఆర్ అప్పగించగా, మరికొందరు ఇంకా బకాయి పడ్డారు. సీఎంఆర్ బియ్యం అప్పగించాలని వారం రోజులుగా జిల్లా అదనపు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లు ఆయా మిల్లుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. ముఖ్యంగా కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ వద్ద ఉన్న రెండు మిల్లులు భారీగా బకాయి పడ్డాయి. ఈ రెండు మిల్లులే దాదాపు రూ.60 కోట్లకుపైగా విలువైన బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

రెండు సీజన్లలోనూ పెండింగే..

కోదాడ డివిజన్ పరిధిలో ఉన్న 31 మిల్లులకు గత ఏడాది వానాకాలం సీజన్‌లో కేటాయించిన ధాన్యానికి మిల్లర్లు 2,10,284 టన్నుల సీఎంఆర్ ఇవ్వాల్సి ఉంది. 89 శాతం లోపే ఇచ్చారు. ఇక, గతేడాది యాసంగి సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం మిల్లర్లు ఇచ్చిన ధాన్యానికి 2,42,168 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా కేవలం 14 శాతమే ఇచ్చారని అధికారులు అంటున్నారు.

మిల్లుల్లో కనిపించని ధాన్యం నిల్వలు

ప్రభుత్వానికి భారీగా బియ్యం బకాయిపడ్డ మిల్లుల్లో అధికారులు ఇటీవల తనిఖీలు చేశారు. పలు మిల్లుల్లో ధాన్యం నిల్వలు కనపడలేదని అధికారులు గుర్తించారు. వీరంతా ఈ ధాన్యాన్ని మర ఆడించి బహిరంగ మార్కెట్‌లో అమ్ముకున్నారని అధికారులు గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో పలువురు ప్రజాప్రతినిధులు మిల్లర్లకు అండగా ఉండి అధికారుల మీద ఒత్తిడి తెచ్చి దాడులు జరపకుండా అడ్డుకున్నారు. దీంతో జిల్లాలో మిల్లర్లు ఆడిందే ఆటగా పాడిందే పాటగా మారింది. కొందరు మిల్లర్లు రేషన్‌బియ్యం రీసైక్లింగ్ చేసి బకాయిలు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ, కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై గట్టి నిఘా పెట్టడంతో వీరి ఆటలు సాగడం లేదని పలువురు అంటున్నారు. భారీగా బకాయి ఉన్న మిల్లులపై అధికారులు చర్యలు తీసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. అవసరమైతే మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగిస్తామని అధికారులు అంటున్నారు.

కోదాడ డివిజన్‌లో 2022–23లో సీఎంఆర్ బకాయిలు (టన్నుల్లో..)

సీజన్	ఇవ్వాల్సిన బియ్యం	ఇచ్చిన బియ్యం	బకాయి	పెండింగ్‌శాతం
వానాకాలం	2,10 284	1,85,763	24,521	89
యాసంగి	2,42,168	36,055	2,06,113	14

ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం

కోదాడ డివిజన్ పరిధిలో మిల్లర్లు ప్రభుత్వానికి భారీగా సీఎంఆర్ బకాయి పడ్డారు. గతేడాది వానాకాలం సీజన్‌లో 11 శాతం, యాసంగి సీజన్‌లో 86 శాతం బియ్యం బకాయి పడ్డారు. అందరికీ నోటీసులు జారీ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగిస్తాం.

మోహన్‌బాబు, డీఎస్ఓ, సూర్యాపేట

క్లుప్తంగా

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న జరగాల్సిన పరీక్షలు 11వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. పరీక్షల టైమ్ టేబుల్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టినట్లు పేర్కొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



విద్యార్థులకు కరాటే బెల్టులు అందజేస్తున్న సుమన్

మిర్యాలగూడ: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో సుమన్ అకాడమీ కరాటే చాంపియన్ షిప్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, గురుకుల పాఠశాలల విద్యార్థులకు కరాటే బెల్టులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను కరాటే అకాడమీ స్థాపించి 50 సంవత్సరాలు అవుతుందని, దేశ వ్యాప్తంగా ఎంతో మంది విద్యార్థులు, మహిళలు కరాటే నేర్చుకున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో కరాటే అకాడమీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు, మహిళలకు ఉచిత కరాటే శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు సైదులు, రామకృష్ణనాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటికి చేరుకున్న అదృశ్యమైన విద్యార్థిని

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలో శుక్రవారం అదృశ్యమైన గురుకుల విద్యార్థిని క్షేమంగా ఇంటికి చేరింది. మండల కేంద్రంలో గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని ఉదయం 7.30గంటల సమయంలో నీళ్ల ట్యాంకర్ పాఠశాలకు రావడంతో.. అదే సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లింది. విద్యార్థిని కనిపించకపోవడంతో పాఠశాల సిబ్బంది పోలీసులు, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విద్యార్థిని ఆచూకీ కోసం తల్లిదండ్రులు, పోలీసులు వెతికే పనిలో ఉండగా.. సదరు విద్యార్థిని తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను సికింద్రాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందించింది. వెంటనే వారు అక్కడికి చేరుకుని క్షేమంగా ఇంటికి తీసుకొచ్చారు.

200 కుండలాలతో మహాయజ్ఞం



మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు



హోమం నిర్వహిస్తున్న ఆర్య సమాజ్ ప్రతినిధులు

- ఆర్యసమాజ్‌లో శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్‌లో శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 200 కుండలాలతో మహాయజ్ఞం నిర్వహించారు. ఈ మహాయజ్ఞం మూడు రోజుల పాటు కొనసాగనుంది. ప్రధాన యజ్ఞకుండలిని పాతబస్తీ షేర్ బంగ్లా నుంచి ఆర్య సమాజ్ వరకు ర్యాలీగా తీసుకువచ్చారు. స్వామి ప్రణవానంద సరస్వతీ పర్యవేక్షణలో మహాయజ్ఞం జరిపించారు. కార్యక్రమంలో స్వామి ఆర్యవేశ్, ఆచార్య సూర్యాదేవి, పండిత ధర్మపాల్ శాస్త్రి, ఆచార్య యోగేంద్ర యాజిక్, ఆచార్య విశ్వశ్రవ, నల్లగొండ జిల్లా ఆర్య సమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రణవానంద స్వామి

యాదాద్రి ఆలయాభివృద్ధికి కృషిచేస్తా

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



తూర్పు మాడ వీధిలో ఏర్పాటు చేసిన స్టాండ్‌లో భక్తులతో కొబ్బరికాయ కొట్టిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి కొండపైన గల తూర్పు మాఢ వీధిలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టేందుకుగాను స్టాండ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వాతి నక్షత్రం సందర్భంగా తూర్పు మాఢ వీధిలోని క్యూలైన్ సమీపంలో భక్తులు కొబ్బరికాయలు కొట్టేందుకు వీలుగా స్టాండ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కొండపైన భక్తులు నిద్ర చేసేందుకు డార్మెంటరీ హాల్ నిర్మాణంతో పాటు తాత్కాలిక హాల్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆలయాభివృద్ధికి నిధులు ఎక్కువగా తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డితో యాదాద్రి ఆలయానికి సంబంధించి పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. త్వరలోనే దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి సందర్శించి, రివ్యూ నిర్వహించిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి ఆలయాన్ని సందర్శిస్తారని వెల్లడించారు. పాత సంప్రదాయం ప్రకారం త్వరలో యాదాద్రిని యాదగిరిగుట్టగా, భద్రాద్రిని భద్రాచలంగా మారుస్తానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అంతకు ముందు శ్రీస్వామిని దర్శించుకున్న విప్ బీర్ల ఐలయ్యకు ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, వర్తక సంఘం అధ్యక్షుడు గడ్డమీది మాధవులు, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి తిరుమల దేవస్థానంగా స్వర్ణగిరి క్షేత్రం





భువనగిరి పట్టణ శివారులోని పగిడిపల్లిలో నిర్మించిన స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం

- భువనగిరి సమీపంలో 22 ఎకరాల్లో రూపుదిద్దుకున్న స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం
- ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు
- 6న వేంకటేశ్వరస్వామి ప్రాణప్రతిష్ఠ

భువనగిరి : భువనగిరి మండలంలోని పగిడిపల్లి గ్రామ పరిధిలో 22 ఎకరాల స్థలంలో నిర్మించిన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఆలయం ప్రాణప్రతిష్ఠ మహా కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ వరకు జరగనున్నాయి. 6న ఉదయం 11.06 గంటలకు జరిగే ప్రాణప్రతిష్ఠకు త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి హాజరుకానున్నారు. మానెపల్లి రామారావు, విజయలక్ష్మీ దంపతులు కుమారులు మానెపల్లి మురళీకృష్ణ, గోపీకృష్ణ ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించారు. కృష్ణ శిలలతో ఆలయాన్ని సుందరంగా నిర్మించి యాదాద్రి తిరుమల దేవస్థానంగా పేరు రూపుదిద్దుకునేలా తీర్చిదిద్దారు. 12 అడుగుల ఎత్తులో శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని రూపొందించారు. ప్రసిద్ధి చెందిన స్థపతి డీఎన్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయం నిర్మించబడింది. ఆలయానికి సంబంధించిన ప్రధాన తూర్పు గోపురానికి త్రైలోక్య మల్ల రాజగోపుం, దక్షిణ రాజగోపురానికి త్రిభువన మల్ల రాజగోపురం, పశ్చిమ గోపురానికి భువనైక మల్ల రాజగోపురం, ఉత్తర గోపురానికి కాకతీయ రాజుల బిరుదులతో రాయ గజకేసరి రాజగోపురంగా నామకరణం చేశారు. ఆలయం ఆవరణంలో గరుడాళ్వార్, మదన గోపాలకృష్ణ స్వామి, పద్మవతి అమ్మవారు దేవాలయాలను నిర్మించారు. ఈ నెల 7వ తేది నుంచి భక్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అనుమతిస్తున్నట్లు మానేపల్లి ట్రస్ట్ అధినేత రామారావు, స్థపతి డీఎన్‌వీ ప్రసాద్, పూజారి శ్రవణాచార్యులు తెలిపారు.

కారు ఢీకొని నలుగురికి గాయాలు

రామన్నపేట: మండలంలోని సిరిపురం గ్రామ శివారులో శుక్రవారం బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామానికి చెందిన బోదాసు రాజు తన కుటుంబసభ్యులతో కలిసి బైక్‌పై రామన్నపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మార్కండేయస్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజుతోపాటు అతడి భార్య వాణి, కుమారులు శశాంక్, హర్షవర్ధన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ మల్లయ్య వారితో మాట్లాడి వివరాలు సేకరించారు.

ఆడిటింగ్ శాఖ కార్యాలయంలో అగ్నిప్రమాదం

- ఫైళ్లు, కంప్యూటర్లు, ఇతర సామగ్రి దగ్ధం



ఆడిట్ కార్యాలయంలో దగ్ధమైన కుర్చీలు, టేబుళ్లు



దగ్ధమైన కంప్యూటర్

నల్లగొండ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని పాత జిల్లా పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న జిల్లా ఆడిట్ శాఖ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రాత్రి 12 గంటల సమయంలో ఆడిట్ కార్యాలయంలోని కంప్యూటర్ గది, జిల్లా అధికారి గది నుంచి మంటలు రావడాన్ని.. ఇదే ఆవరణలో ఉన్న ఆర్అండ్‌బి శాఖ సిబ్బంది ఒకరు గమనించి ఆడిట్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వారు అగ్నిమాపక అధికారులకు చెప్పారు. రాత్రి 12. 30 గంటల ప్రాంతంలో ఆడిట్ సిబ్బందితోపాటు, జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. అయితే, అప్పటికే చాలా ఫైళ్ళు దగ్ధమయ్యాయి. ఆడిట్ కార్యాలయంలోని కంప్యూటర్ గది మొత్తం దగ్ధమైంది. కంప్యూటర్లకు యూపీఎస్ అమర్చిన చోట షార్ట్‌సర్క్యూట్ కావడం వల్ల మంటలు చెలరేగినట్లు భావిస్తున్నారు. సీలింగ్ అటుకోవడం వల్ల మంటలు ఎగిసిపడి కంప్యూటర్లతోపాటు, బీరువాలు కాలిపోయాయి. బీరువాలలో ఉన్న ఫైళ్ళతో పాటు టేబుళ్లపై ఉన్న ఫైళ్ళు కూడా దగ్ధమయ్యాయి. ప్రధానంగా నాలుగు కంప్యూటర్లతోపాటు నాలుగు బీరువాలు, అందులో ఉన్న 8 వరకు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారి ఎస్.ఆర్ బుక్కులు కాలిపోయాయి.

సంఘటనపై అనుమానాలు...

ఆడిట్ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు షార్ట్‌సర్క్యూట్ కావడం వల్ల మంటలు చెలరేగాయని చెబుతుండగా.. చేసిన తప్పిదాలు, అక్రమాలు బయటపడతాయని అందుకు సంబంధించిన వారే ప్రమాదాన్ని సృష్టించారనే చర్చ సాగుతోంది. గతంలో కూడా మున్సిపాలిటీలో కొందరు ఉద్యోగులు అక్రమాలకు పాల్పడి ఫైళ్ళను దగ్ధం చేశారని, అదే తరహాలో ఆడిట్ కార్యాయంలో కూడా ఫైళ్ళ దగ్ధానికి పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం
– కృపాకర్‌రావు, ఆడిట్ అధికారి

ఆడిట్ కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్నిప్రమాదం జరిగిందని, కొన్ని ఫైళ్లు పాక్షికంగా, కొన్ని ఫైళ్లు పూర్తిగా కాలిపోయాయని జిల్లా ఆడిట్ అధికారి కృపాకర్‌రావు చెప్పారు. అయితే, ముఖ్యమైన డేటా అంతా దగ్ధమైన కంప్యూటర్లలోనే నిక్షిప్తమై ఉందని, వారం రోజుల్లో తిరిగి అన్ని ఫైళ్లను తయారు చేస్తామని చెప్పారు. ఎస్.ఆర్‌లు కూడా పూర్తిగా కాలలేదని చెప్పారు. ఎవరికి కూడా ఎలాంటి నష్టం జరుగకుండా చూస్తామని చెప్పారు. కాగా, ఈ సంఘటనను హైదరాబాద్ ఆడిట్ అధికారి కూడా వచ్చి పరిశీలించారు.



కాలిపోయిన ఫైళ్లు

పీడీఎస్ బియ్యం పట్టివేత

మఠంపల్లి: మండలంలోని రఘునాథపాలెంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. గ్రామానికి చెందిన మహ్మద్ అమీర్ తన ఇంటిలో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వచేశాడని వచ్చిన సమాచారంతో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మూడు గేదెలు మృతి

భువనగిరి రూరల్: భువనగిరి మండలంలోని ఎర్రంబెల్లి గ్రామంలో సోమలేటి సైదులుకు చెందిన మూడు గేదెలు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాయి. పట్టణంలోని ఓ సీడ్స్ దుకాణంలో పశువుల దాణా తీసుకువచ్చి నీటిలో కలిపి గేదెలకు పెట్టిన అనంతరం అవి కిందపడి కొట్టుకుని మృతిచెందాయని రైతు పేర్కొన్నాడు. సైదులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

- ఎండమావులు



ఈ చిత్రాలను చూస్తే రోడ్డుపై నీరు పారుతున్నట్లే ఉంది కదా.. ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో యాదాద్రి భువనగిరిలోని వరంగల్–హైదరాబాద్ రోడ్డుపై ఇలా ఎండమావులు ఏర్పడ్డాయి. ఈ వేసవిలో ఎండలు ఎక్కువ ఉంటాయనడానికి ఈ చిత్రాలే నిదర్శనం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రి భువనగిరి



చికిత్స పొందుతున్న మహిళ మృతి

- ఆటోను బస్సు ఢీకొట్టిన ఘటనలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య



లక్ష్మి (ఫైల్)

మునగాల(కోదాడ): మోతె శివారులో ఇటీవల ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. తీవ్రంగా గాయపడిన మునగాల మండలంలోని రేపాల గ్రామానికి చెందిన సొంపంగు లక్ష్మి(35) హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. వివరాల ప్రకారం.. రేపాలకు చెందిన సొంపంగు అంజయ్య కుమార్తె లక్ష్మికి వివాహమైనప్పటికీ కొన్నేళ్లుగా భర్తకు దూరంగా ఉంటుంది. రేపాలలోనే కూలీనాలీ చేస్తూ జీవనం సాగిస్తూ తండ్రిని పోషిస్తోంది. ఈ క్రమంలో గత బుధవారం తన తోటి కూలీలతో విజయరాఘవపురం గ్రామానికి చెందిన ఆటోలో మిర్చి తోటలో కాయలు ఏరేందుకు మోతె మండలం హుస్సేనాబాద్‌కు బయలుదేరింది. మార్గమధ్యంలో కూలీలు ప్రయాణిస్తున్న ఆటోను మోతె మండల కేంద్రం శివారులో అండర్‌పాస్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయరాఘవపురం గ్రామానికి చెందిన ముగ్గురు కందుల నాగమ్మ, చెవుల నారాయణమ్మ, పోకల అనసూర్యమ్మ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. తీవ్ర గాయాలైన విజయరాఘవపురం వాసులు కందుల గుర్వయ్య, రెమిడాల సౌభాగ్యమ్మ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందారు. ఇదిలా ఉండగా.. తీవ్ర గాయాలపాలైన రేపాలకు చెందిన సొంపంగు లక్ష్మి మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం తుదిశ్వాస విడిచింది. రేపాలకు చెందిన పోకల అనసూర్యమ్మ(70) అంత్యక్రియలు జరిగి 24గంటలు గడవకముందే లక్ష్మి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం

- ఈ నెల 6న కుమార్తె వివాహం
- శుభలేఖలు పంచడానికి వెళ్లొస్తూ మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన తండ్రి
- చికిత్స పొందుతూ మృతి



రాములు(ఫైల్)

నిడమనూరు: శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది. తన కూతురు వివాహ లగ్నపత్రికలు పంచేందుకు వెళ్లి వస్తుండగా.. మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. నిడమనూరు మండలం ఊట్కూర్ గ్రామానికి చెందిన నర్సింగ్ రాములు(55), పుల్లమ్మ దంపతులకు మహేశ్వరి, మమత ఇద్దరు కుమార్తెలు.. పెద్ద కుమార్తె వివాహం అయింది. చిన్న కుమార్తె మమతకు ఈనెల 6వ తేదీన వివాహం జరిపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఈక్రమంలో అదే గ్రామానికి చెందిన బంధువైన శేఖర్‌తో కలిసి ఫిబ్రవరి 28న శుభలేఖలు పంచేందుకు బైక్‌పై వెళ్లాడు. శ్రీనాథపురం స్టేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతిచెందగా.. రాములుకు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

తుంగతుర్తి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం గానుగుబండలో చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గానుగుబండ గ్రామానికి చెందిన గూడెల్లి వీరమల్లు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలంటుకొని ఇంట్లో ఉన్న సామగ్రి కాలిపోయింది. ఇంట్లో నుంచి పొగలు వస్తుండగా గ్రామస్తులు గమనించి వీరమల్లుకు సమాచారం అందించారు. ఆయన వచ్చి చూసేసరికి ఇంట్లో ఉన్న టీవీ, బీరువా, మంచం, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

ఒక్కొక్కరికి మూడు.. నాలుగు కొలువులు

- పట్టుబట్టి చదివి ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు



విజయలక్ష్మి

కోదాదరూరల్ : కోదాడ మండల పరిధిలోని అడ్లూరుకు చెందిన ఎర్రగొల్ల విజయలక్ష్మి ఇటీవల విడుదల చేసిన గురుకుల టీజీటీ, పీజీటీ ఉద్యోగాలకు ఎంపికకాగా.. గురువారం విడుదల చేసిన జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి కూడా ఎంపికైంది. తన భర్త పాశం రామాంజి, కుటుంబ సభ్యుల సహకారంతోనే పరీక్షలకు సన్నద్ధమై ఈ ఉద్యోగాలు సాధించినట్లు విజయలక్ష్మి తెలిపారు.

గిరిజన మహిళకు..



సుజాత

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పోర్లగడ్డతండాకు చెందిన అంగోతు సుజాత ఇటీవల పీజీటీ, టీజీటీ ఉద్యోగం సాధించింది. అదేవిధంగా గురుకుల జూనియర్ లెక్చరర్ ఉద్యోగం కూడా వచ్చింది. ప్రస్తుతం కేంద్రీయ విద్యాలయం -చంద్రయాన్‌గుట్టలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. తన తండ్రి హతీరాం, భర్త సంతోష్‌కుమార్ సహకారంతో ఉద్యోగాలు సాధించినట్లు ఆమె పేర్కొంది.

పార్ట్‌టైం జాబ్ చేస్తూ..



నల్లగంతుల మల్లేష్

డిండి: డిండి పట్టణానికి చెందిన నల్లగంతుల మల్లేష్ మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. మల్లేష్ చిన్నతనంలోనే అనారోగ్యం కారణంతో తల్లిదండ్రులిద్దరూ చనిపోయారు. నిరుపేద కావడంతో హైదరాబాద్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తూ ఉన్నత చదువులు చదివాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో జూనియర్ లెక్చరర్, పీఈటీ, పీజీటీ ఉద్యోగాలు పొందాడు.

కుటుంబసభ్యుల హర్షం



సిలువేరు సుష్మ

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన సిలువేరు సుష్మ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. తాజాగా వెలువడిన గురుకుల ఫలితాల్లో జూనియర్ లెక్చరర్‌తోపాటు, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించారు. సుష్మ విజయానికి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పుస్తకాలతో కుస్తీ



మందుల మంగమ్మ

నడిగూడెం: పుస్తకాలతో కుస్తీ పట్టి, నాలుగు ఉద్యోగాలు సాధించింది నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన మందుల మంగమ్మ. ఎలాంటి కోచింగ్ లేకుండానే పట్టుదలతో పరీక్షలకు సన్నద్ధమైంది. కేజీబీవీ పరీక్షలో పీజీటీ ఉద్యోగంతోపాటు, గురుకుల పీజీటీ, టీజీటీ, జూనియర్ లెక్చరర్ ఉద్యోగాలు సాధించింది

ఒకేసారి నాలుగు ఉద్యోగాలు



హరిత

చిట్యాల: మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఎల్లాపంతుల ఉమామహేశ్వర్ భార్య హరిత ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది. గురుకుల కెమిస్ట్రి లెక్చరర్, గురుకుల పీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ జనరల్ సైన్స్, టీజీటీ బయోలజికల్ సైన్స్ విభాగాల్లో ఉద్యోగాలు పొందింది. ఆమె ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే..



షేక్ ఆసిఫ్

మాడుగులపల్లి : మాడుగులపల్లి మండలం చిరుమర్తి గ్రామ పంచాయతీ కార్యదర్శి షేక్ ఆసిఫ్ ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే.. పోటీ పరీక్షలకు సన్నద్ధమై గురుకుల జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించాడు. తన కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, భార్య తోడ్పాటు ఈ విజయానికి కారణమని షేక్ ఆసిఫ్ పేర్కొన్నాడు.

మొదటి ప్రయత్నంలోనే..



రామరాజు

నల్లగొండ: నల్లగొండ పట్టణం అక్కలాయిగూడేనికి చెందిన కన్నెబోయిన రామరాజు మొదటి ప్రయత్నంలోనే గురుకుల పీజీటీ, జేఎల్, డీఎల్ ఉద్యోగాలు సాధించాడు. ఈమేరకు శుక్రవారం జిల్లా యాదవ ఉద్యోగుల సంఘం, యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో రామరాజును సన్మానించి అభినందనలు తెలిపారు.